అర్హులందరికీ రేషన్ కార్డులు



మాట్లాడుతున్న కోట నీలిమ

అమీర్‌పేట: అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటానని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బుధవారం అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులు, కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న మహిళతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల గణన సమయంలో రేషన్ కార్డులు రాని వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. దిగువ, మధ్య తరగతి వర్గానికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని, మిగతా వారికి సైతం కార్డులు వస్తాయని గుర్తు చేశారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా వాణి ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ ప్రక్రియలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిఫిన్ డబ్బులు అడిగినందుకు చంపేస్తామని బెదిరింపులు

ముగ్గురు యువకులపై కేసు నమోదు

అమీర్‌పేట: టిఫిన్ చేసి డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడమేగాక డబ్బులు అడిగితే చంపుతామని బెదిరింపులకు పాల్పడిన యువకులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ఆనంద్ అనే వ్యక్తి గత 8 ఏళ్లుగా ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి అక్కడికి వచ్చిన ముగ్గురు యువకులు ఏడు టిఫిన్లు ఆర్డర్ చేశారు. టిఫిన్ తిని ఐదు ప్లేట్లకు మాత్రమే డబ్బులు చెల్లించారు. మిగతా రెండింటికి కూడా డబ్బులు ఇవ్వాలని అడగ్గా డబ్బులు ఇచ్చేది లేదని, మీ ఇష్టం వచ్చిన చోట్ల చెప్పుకో అంటూ వాగ్వివాదానికి దిగి అతడిపై దాడికి యత్నించారు. డబ్బులు అడిగితే చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులను బాపూనగర్‌కు రమేష్, గచ్చిబౌలికి చెందిన పవన్, దినేష్‌గా గుర్తించిన పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య



గుర్తుతెలియని మహిళ మృతదేహం

సికింద్రాబాద్: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాజీద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మౌలాలి - లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలపై బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని మహిళ వందే భారత్ రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కొన ఊపిరితో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందింది. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, తెలుపు రంగు లెగ్గిన్స్, గ్రీన్ కలర్ టాప్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వృద్ధుడి మృతి

సికింద్రాబాద్: రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మణయ్య(73) అనే వృద్ధుడు సికింద్రాబాద్‌కు వచ్చేందుకు నెల్లూరులో చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మంగళవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నంబర్ 9 కి చేరుకున్న రైలులో నుంచి అతను కిందికి దిగుతుండగా ప్రమాదశాత్తు కాలు జారి ప్లాట్ ఫామ్ - రైలు మధ్యలో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే సిబ్బంది అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

అడ్డగుట్ట: తుకారాంగేట్ రియో పాయింట్ వద్ద గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం అధికారులతో కలిసి ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు.

పచ్చదనం.. ఆహ్లాదం

- నిర్వహణలో మేటి మోడల్ కాలనీ పార్కు
- అరుదైన వృక్ష సంపద, పక్షులకు నెలవుగా ఉద్యానవనం
- తాజాగా వరించిన గోల్డెన్ గార్డెన్ సర్టిఫికెట్





మోడల్ కాలనీ పార్కు

సనత్‌నగర్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతూ..పచ్చదనంలో మేటిగా ఉన్న మోడల్‌కాలనీ పార్కుకు మరోసారి అవార్డు వరించింది. మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణలో కొనసాగుతున్న ఈ పార్కు ఇప్పటికే పలువురు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకోవడంతో పాటు జీహెచ్ఎంసీ అవార్డులు గెలుచుకుంది. తాజాగా మరోసారి గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్‌ను సాధించింది. తెలంగాణ ప్రభుత్వ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 2024 జనవరి 15 నుంచి 30 వరకు జరిగిన 8వ గార్డెన్ ఫెస్టివల్-2024లో ఆరో ఎంట్రీగా నమోదైన మోడల్‌కాలనీ ఉద్యానవనం ఈ గోల్డెన్ గార్డెన్ సర్టిఫికెట్ సాధించింది. ఈ సందర్భంగా 'మోడల్' పార్కుపై ప్రత్యేక కథనం..

వృక్ష సంపదకు కేరాఫ్‌గా..

ఈ పార్కులో అందమైన పూల మొక్కలతో పాటు అరుదైన వృక్ష జాతులు ఉన్నాయి. మామిడి, తులసీ, నందివర్ధనం, మారేడు, ఉసిరి, అశోక, సన్నజాజి, అరటి వంటి మొక్కలు, చెట్లతో పాటు అరుదైన జాతులైన అశ్వగంధ, గంధం, రాధా మాధవి వంటి ఎన్నో రకాల మొక్కలు సువాసనలు వెదజల్లుతుంటాయి. అంతేగాకుండా రంగురంగుల సీతాకోక చిలుకలు, చిలుకలు కనిపిస్తుంటాయి.

సందర్శకులకు అన్ని సౌకర్యాలు..

మోడల్‌కాలనీ పార్కు ప్రశాంతతకు నెలవుగా నిలుస్తోందనే చెప్పాలి. విరబూసిన పుష్పాలు..పచ్చిక బయళ్లు కనువిందు చేస్తుండగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్లు, సందర్శకులు మైమరిచిపోతుంటారు. పిల్లలు, పెద్దలు, వయోధికులు, మహిళలు..



గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్

ఇలా అన్ని వర్గాల వారు కాసేపు ఇక్కడ సేదదీరి ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదిస్తుంటారు. ఇందుకోసం అక్కడక్కడ బెంచీలను సైతం ఏర్పాటు చేశారు. ఇక కార్తీక మాసం వచ్చిందంటే చాలు కాలనీ మొత్తం ఈ పార్కులోనే వన భోజనాలతో సందడి చేయడం పరిపాటి.

నిర్వహణలో మేటిగా..

చెట్ల ద్వారా వచ్చే వ్యర్థాలు బయటకు తరలించకుండా పార్కులోనే ఒక పెద్ద గొయ్యిలో వేసి బయోగ్యాస్ ఉత్పత్తి చేసేలా ఏర్పాట్లు చేశారు. అలాగే వర్షపు నీరు అక్కడికక్కడే ఇంకేలా పలుచోట్ల ఇంకుడుగుంతలు నిర్మించారు. ఈ పార్కు నిర్వహణకు గాను 2022లో నిర్వహించిన గార్డెన్ ఫెస్టివల్‌లో ప్రథమ బహుమతి లభించింది.

8 నుంచి ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో కుంకుమార్చన

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి 12 వరకు కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక కల్యాణం కోసం 5 రోజుల పాటు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవాలయ ప్రాంగణంలోని అద్దాల మండపంలో ఈ పూజలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం , కుంకుమార్చనలు మహిళా సత్సంగ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఓ మహిళకు సుహాసినీ పూజలు చేస్తారన్నారు. 12న శాంతి హోమం, పూర్ణాహుతి విశేష పూజలు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు

విలీనంతోనే సమస్యల పరిష్కారం



బస్తీ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ద్వారానే ఇక్కడి సమస్యలకు తగిన పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బస్తీ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఒకటో వార్డు బోయిన్‌పల్లిలోని లక్ష్మి నర్సింహ నగర్, బాపూజీ నగర్ లలోని బస్తీల్లో పర్యటించారు. స్థానికులు ఎన్నో ఏళ్ళుగా ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా బస్తీల్లో డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలను వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో సమస్యల పరిష్కారానికి రాష్ట ప్రభుత్వం చొరవ చూపలేకపోతుందని, నిధుల కేటాయింపు కూడా సమస్యగా మారుతుందన్నారు. కంటోన్మెంట్ బోర్డు రాష్ట ప్రభుత్వానికి చెల్లించాల్సిన సర్వీస్ చార్జీలను కూడా చెల్లించడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డును తన చేతుల్లో పెట్టుకుని ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేకపోతుందన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. తాను కూడా ఎమ్మెల్యేగా ప్రభుత్వం నుంచి నిధులను తీసుకువచ్చి బస్తీలను అభివృద్ధి చేయడానికి అవకాశం దొరుకుతుందని, ప్రజలు కూడా దీనిపై ఆలోచించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, అజయ్ కుమార్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్, బల్వంత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానానికి వీల్‌చైర్లు వితరణ

చిలకలగూడ : సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రేటర్ హైదరాబాద్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు నాగులూరి సాయిబాబాతోపాటు పద్మజారేఖ, నరేష్‌కుమార్ దంపతులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వీల్ చైర్లను విరాళంగా అందజేశారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆరు అధునాతన వీల్‌చైర్లను ఆలయ కార్యనిర్వహణాధికారి భాస్కరరావుకు అందజేశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, నడవలేని వారికి మరింత సులభంగా స్వామివారి దర్శనభాగ్యం కల్పించేందుకు వీల్ చైర్లను అందించినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు నాగులూరి సాయిబాబా తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ ఈఓ భాస్కరరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఓ రమేష్, ఆలయ ప్రతినిధులు, అర్చకులు పాల్గొన్నారు.



వీల్‌చైర్లు అందజేస్తున్న నాగులూరి సాయిబాబా తదితరులు

సామాన్యులకు ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: కేంద్ర బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడేలా ఉందని అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య అన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజలకు ప్రయోజనకరంగా ఉందన్నారు. రూ. 12 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు ఇవ్వడంతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణ, హంసరాజు, వీరేశం, శివలింగం, రాజారాం, దుర్గప్రసాద్, శివాజీ, రాజశేఖర్, శ్రావణ్, వెంకటస్వామి, లక్ష్మణ్, రాజశేఖర్, వెంకటేష్, శ్యామల, రాములమ్మ, కళ్యాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

వెంగళరావునగర్ : అన్నార్థులకు సేవలు అందించడంలో మధురానగర్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అసోసియేషన్ నేతలు అన్నారు. జలమండలిశాఖలో పని చేస్తూ గత నెల ఆకస్మికంగా మృతిచెందిన జగదీష్ పిల్లలకు బుధవారం అసోసియేషన్ నేతలు ఆర్థిక సాయం అందజేశారు. ఐదేళ్ల క్రితం తల్లిని కోల్పోగా, గత నెలలో తండ్రి కూడా చనిపోవడంతో వారు అనాథలుగా మారారు. ఈ నేపథ్యంలో మధురానగర్ అసోసియేషన్ రూ.1, 25,510 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో చిన్నారులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, కోశాధికారి కె.సుగుణ, మాజీ నేతలు, కాలనీ పెద్దలు, శాశ్వత సభ్యులు డి.నాగార్జునరెడ్డి, రాజగోపాల్, హనుమంతరావు, చంద్రమోహన్, విజయవాణి, రాజేంద్రప్రసాద్, హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మధురానగర్ అసోసియేషన్ నేతలు

హ్యాండ్ బాల్ విజేతగా హిందీ మహా విద్యాలయ జట్టు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల పోటీల్లో హ్యాండ్ బాల్ విజేతగా హిందీ మహావిద్యాలయ జట్టు నిలిచినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్స్‌లో సికింద్రాబాద్ పీజీ కాలేజీ జట్టు పై మహా విద్యాలయ జట్టు విజయం సాధించిందన్నారు. మూడో స్థానంలో భవన్స్ వివేకనంద కాలేజీ నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇఫ్లూకు పర్మనెంట్ వీసీని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)కు పర్మనెంట్ వీసీని నియమించాలని విద్యార్థులు కోరారు. మాజీ వీసీ ప్రొ.సురేష్ కుమార్ పదవీ కాలం ముగిసిన తర్వాత ఏడాదిగా ఇన్‌చార్జి వీసీలే ఇఫ్లూ పాలన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తొలుత ప్రొ.సురభి భారతి ఇన్‌చార్జి వీసీగా పని చేసి ఉద్యోగ విరమణ చేయగా ప్రస్తుతం ప్రొ.హరిబండి లక్ష్మీ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు. అయితే ఇన్‌చార్జి వీసీలకు పరిమిత అధికారాలు ఉన్నందున ఇఫ్లూ అభివృద్ధి కుంటుపడుతోందని విద్యార్థులు పేర్కొన్నారు. అధ్యాపకుల, ఉద్యోగుల పదోన్నతులు నిలిచిపోయాయని, యూజీసీ గ్రాంట్స్, ఇతర నిధులు, ప్రాజెక్టులు రావడం లేదని వారు పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో పాటు విదేశీ విద్యార్థులు పర్మనెంట్ వీసీ లేనందున ఇబ్బందులు పడుతున్నారన్నారు.

9, 10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 9, 10 తేదీల్లో హిమాయత్‌నగర్‌లో జరగనున్నాయి. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సమావేశాల విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని విద్యార్థి నేతలు ఆవిష్కరించారు.

వన్‌టైం ఛాన్స్ పీజీ పరీక్షలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వన్ టైం పీజీ 2, 4 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 నుంచి 1, 3 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఫీజు చెల్లించిన విద్యార్థులు ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి హాల్ టికెట్లను పొందవచ్చు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

స్వయం ఉపాధికి చేయూత

బంజారాహిల్స్: సెంటిఫిక్ టెక్ కంపెనీ కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన నిరుపేద మహిళలకు బుధవారం రూ.14 లక్షల విలువైన నాలుగు జ్యూట్, మరో నాలుగు కుట్టు మిషన్లను పంపిణీ చేసింది. సదరు సంస్థ నగరానికి చెందిన ఎన్జీఓ ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్)కు నైపుణ్యాభివృద్ధికి సహకారాన్ని అందిస్తోంది. అందులో భాగంగా మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం రహమత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్ ప్రాంతంలో నివసించే జి.శంకర్‌గౌడ్ వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 4వ తేదీ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి మరుసటి రోజు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాల అందజేత

సనత్‌నగర్: అనారోగ్యం బారిన పడినప్పుడు ధైర్యంగా ఉండాలని, మెరుగైన వైద్యంతో తిరిగి సాధారణ జీవితం గడపవచ్చని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బుధవారం సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4.20 లక్షల విలువైన ఆర్థిక సహాయ మంజూరు పత్రాలు (ఎల్ఓసీ)లను అందజేశారు. సనత్‌నగర్‌కు చెందిన చెంచులక్ష్మీ వెన్నెముక సంబంధ సమస్యతో బాధపడుతుండగా చికిత్స కోసం రూ.2లక్షలు, అమీర్‌పేట సుప్రభాత్‌నగర్‌కు చెందిన గోపీ గుండె చికిత్స కోసం రూ.1.10 లక్షలు, ఎస్సార్‌నగర్‌కు చెందిన రాథోడ్ ఉదయ్‌సింగ్‌కు రూ.1.10 లక్షల ఆర్థిక సహాయం మంజూరు కాగా, లబ్ధిదారుల కుటుంబాలకు ఎల్ఓసీలను ఎమ్మెల్యే తలసాని అందజేశారు. ఆర్థిక సహాయం మంజూరు చేయించినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు బాల్‌రెడ్డి, సంతోష్ మణికుమార్, నర్సింహ, గోపీలాల్ చౌహాన్, బలరాం, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

నూతన మార్కెట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అల్వాల్ రైతుబజార్ విక్రయదారులు

అడ్డగుట్ట: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా అల్వాల్ రైతు బజార్ భూములను ప్రభుత్వం సేకరిస్తున్న నేపథ్యంలో తమకు నూతన మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి తూంకుంట వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా అల్వాల్ రైతు బజార్ భూములను సేకరిస్తుందన్నారు. నగరం చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు గత 30 ఏళ్లుగా కూరగాయలను పండించి అల్వాల్ రైతు బజార్‌లో అమ్ముకుంటున్నారన్నారు. అల్వాల్ రైతు బజార్ బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్‌లకు దగ్గరగా ఉన్నందున తమకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఈ నేపథ్యంలో రైతు బజార్‌ను దూరంగా మరొక చోటికి మార్చకుండా పరిసర ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా వెయ్యి మంది రైతులు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. రైతు బజార్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఆయన రైతులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మేడ్చల్ మల్కాజ్‌గిరి, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల కూరగాయల రైతులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. బుధవారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అన్నానగర్‌లో పర్యటించారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, వీధిదీపాలు, మంచినీరు తదితర సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తేగా సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఇళ్ల మధ్యలో ఉన్న చిన్ననాలా శిథిలావస్థకు చేరడంతో మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. త్వరలోనే మరమ్మతు పనులు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ ప్రతినిధి లక్ష్మీ, బస్తీ నాయకులు పాల్గొన్నారు.



చిన్న నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ప్రజా సమస్యలపై పోరాటం చేయండి

- బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి



సాక్షి, సిటీ బ్యూరో: జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. బుధవారం హిమాయత్ నగర్ డివిజన్ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. బీజేపీ బలమైన శక్తిగా అవతరిస్తుందని, ప్రజా సమస్యలపై స్పందించి, పరిష్కార మార్గాలు అన్వేషించాలని కోరారు. భాగ్యనగర పరిధిలో ఏ ఎన్నికలు నిర్వహించినా బీజేపీ హవా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, సుధాకర్, మల్లేష్, మనీల శాంతికుమార్ శాంతికుమార్, రంజిత్, మీసాల సాయి, భాను ప్రసాద్, అభిషేక్ యాదవ్, నందు, నరేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.